


హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభా వేదికపై మౌనం పాటించి పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న పార్టీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్, కొప్పుల ఈశ్వర్, సత్యవతి, నిరంజన్‌రెడ్డి, మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, పార్టీ నేతలు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బండా ప్రకాశ్, వినోద్‌కుమార్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ కవిత తదితరులు

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- కగార్ పేరుతో గిరిజనుల ఊచకోత తగదు
- ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా నక్సలైట్లు
- మిలట్రీ చేతిలో ఉందని నరికి పారేస్తమంటే ఎలా?
- ఎల్కతుర్తి సభలో కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కేసీఆర్ కోరారు. కగార్ పేరుతో గిరిజనుల ఊచకోత తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాట్లాడుతూ '' కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరు తో ఛత్తీస్‌గఢ్‌లో యువకులను, గిరిజనులను ఊచకోత కోస్తున్నది. అది ధర్మం కాదు. నక్సలైట్లు ప్రతిపాదన పెడుతున్నరు. మేము ప్రభుత్వం దగ్గరికొచ్చి చర్చలు చేయడానికి సిద్ధంగా ఉన్నమని అంటున్నరు. నేను కేంద్రా న్ని కోరుతున్నా. బలం ఉందికదా అని చంపుకుంటు పోవడం కాదు. అది ప్రజాస్వామ్యం కాదు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయండి. నక్సలైట్లను పిలిచి డెమొక్రటిక్ స్పేస్ ఇచ్చి చర్చలు జరపండి. వాళ్లు ఏమి మాట్లాడుతరో చూడండి. అదిగూడ నల్లనా తెల్లనా దేశం ముందటికి రానీయండి. అట్ల కాదు, మొత్తం నరికి పారేస్తం, కోసి పారేస్తం అంటే ఎలా? మిలట్రీ మీదగ్గర ఉన్నది కాబట్టి కొడతరు. కానీ అది ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఈ మాట ఢిల్లీకి ఉత్తరం పంపిద్దామా? మీరంతా చప్పట్లు కొడితే తీర్మానంగా భావించి కేంద్రానికి పంపిద్దాం.. కేసీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్, బీజేపీపై యుద్ధభేరి

- ఆ పార్టీలకు తెలంగాణలో చోటు లేదని తేల్చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వేదికగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. కాంగ్రెస్, బీజేపీపై యుద్ధభేరి మోగించారు. ఈ రెండు పార్టీలు తెలంగాణ ప్రజలకు, రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని, వైఫల్యాలను ఎండగట్టారు. ఈ రెండు పార్టీలకు తెలంగాణను పరిపాలించే హక్కు లేదని, ఇక్కడ ఆ పార్టీలకు చోటు లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై నిప్పులు కురిపించారు. అగ్రపథంలో ఉన్న తెలంగాణను అధోగతిపాలు చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను ఎగ్గొట్టడంపై మండిపడ్డారు. ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయింది. ఈ సర్కారు ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ సర్కారు సృష్టిస్తున్న విధ్వంసంపై ధ్వజమెత్తారు. బుల్డోజర్లతో పేదల ఇండ్లను కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకుంటూ ఢిల్లీకి సంచులు మోస్తున్నారంటూ మండిపడ్డారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై కూడా నిప్పులు చెరిగారు. తెలంగాణకు బీజేపీ చేస్తున్న ద్రోహాన్ని ప్రజల ముందు ఉంచారు. పదకొండేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. తెలంగాణకు 11 రూపాయలైనా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. మరీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. తెలంగాణ పుట్టుకనే ప్రశ్నించి, అవమానించిన వారు ఏ విధంగా న్యాయం చేస్తారో ఆలోచించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విధంగా ఈ రెండు పార్టీలు తెలంగాణకు చేస్తున్న అన్యాయంపై సవివరింగా చెప్పారు. భవిష్యత్‌పై బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ప్రజల కు సూచించారు. రాష్ట్రానికి ఏ పార్టీతో మేలు జరుగుతుందో ఆలోచించాలని కోరారు.

# కండ్ల ముందే ఇట్లయితదనుకోలే!

- ఎంత మంచిగుండె తెలంగాణ.. బొందలపడేసిండ్రు..
- గింత మోసం చేస్తరనుకోలే.
- ముందుకు పోవాల్సిన తెలంగాణ వెనకకు పోతున్నది
- దీనికి కారణమెవరు? ఈ దుర్మార్గులు కాదా?
- వాళ్లను నిలబెట్టి అడగాల్సిన అవసరం ప్రజలకు లేదా?
- రజతోత్సవ సభలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ) :ఎంత మంచిగుండె తెలంగాణ.. బొందలపడేసిండ్రు.. నా కండ్ల ముందే ఇట్లయితదని అనుకోలే' అని కేసీఆర్ వాపోయారు. ఎల్కతుర్తి సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో నంబర్ వన్ స్థానంలో నిలబెట్టిన తెలంగాణను ఇప్పుడు 14, 15వ స్థానంలోకి పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇయ్యాల చాలా బాధ కలుగుతున్నది. చాలా దుఃఖం కలుగుతున్నది. ఇంకా ముందుకు పోవాల్సిన తెలంగాణ వెన్కకు పోతున్నది. దీనికి కారణం ఎవరు..? ఈ దుర్మార్గులు కాదా? వాళ్లను నిలబెట్టి అడగాల్సిన అవసరం ప్రజలకు లేదా?' అని ప్రశ్నించారు. 'ఒక చిన్న మాట.. కేసీఆర్ కిట్ పథకం పెట్టినం.. ఇది లక్షాధికారుల కోసం పెట్టినమా? కోటీశ్వరుల కోసం పెట్టినమా? ఎవరి కోసం పెట్టినం? గ్రామీణ ప్రాంతాల్లో పేదల కోసం పెట్టినం.. ఆడ పిల్లను కంటే 13 వేలు, మగ పిల్లవాన్ని కంటే 12 వేలు ఇచ్చినం. అమ్మ ఒడి వాహనాలు పెట్టి వాళ్లను దవాఖానకు తీసుకెళ్లి ఉచితంగా ప్రసవాలు చేయించి వాళ్లకు మందులిచ్చి జాగ్రత్తగా ఇంటికాడ దింపినం. ఇది బంద్ చేస్తరా ఎవరైనా?. ఎందుకు బంద్ చెయ్యాలె? ముఖ్యమంత్రులుగా పని చేసేవాళ్లకు గాంభీర్యం ఉండాలె.. ధైర్యం ఉండాలె.. రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆయన ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చిండ్రు. నేను సీఎం అయిన తర్వాత ఈ పథకం ఎలా ఉన్నదని అధికారులను అడిగిన. సార్..ఈ పథకం మంచిగున్నది.. ప్రజలకు ఉపయోగపడుతున్నదని చెప్పిండ్రు. నేను కూడా ఆ పథకాన్ని అట్లనే ఉంచండి.. మార్చకండని ఆదేశించిన. అసెంబ్లీలో కూడా ఆరోగ్యశ్రీ మా పథకం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది.. దాని పేరు కూడా మార్చలేదని చెప్పినం. కానీ ఇప్పుడు వీళ్లు కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తం.. కేసీఆర్ ముచ్చట లేకుండా చేస్తమంటున్నరు. చేస్తరా?

> ప్రభుత్వ జాగల్లో తెలిసో తెలియకో పేదలు గుడిసెలు వేసుకుంటరు. అలాంటి లక్షలాది మంది పేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇండ్ల పట్టాలిచ్చినం. బుల్డోజర్లు, జేసీబీలు పెట్టి మేం చెరువుల్లో పూడికలు తీస్తే.. వీళ్లేమో హైడ్రా అని వాడి బొంద అని పెట్టి పేదల ఇండ్లు కూడలగొడుతున్నరు. ఆనాడు చెరువుల పూడికలు తీసిన బుల్డోజర్లు ఈనాడు పేదల ఇండ్లు కూలగొడుతున్నయి. - కేసీఆర్



### నాడు బుల్డోజర్లు చెరువుల్లో పూడిక తీస్తే.. నేడు పేదల ఇండ్లు కూలగొడుతున్నయి

ప్రభుత్వ జాగల్లో గుడిసెలు వేసుకున్న లక్షలాది మంది పేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో హైదరాబాద్, వరంగల్‌తో పాటు అనేక ప్రాంతాల్లోఇండ్ల పట్టాలిచ్చినం. బుల్డోజర్లు, జేసీబీలు పెట్టి మేం చెరువుల్లో పూడికలు తీస్తే.. వీళ్లే మో హైడ్రా అని పేదల ఇండ్లు కూడలగొడుతున్నరు. ఇవన్నీ చూసి మౌనంగా ఉందామా? ఏం చేద్దాం? ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

### ఏ భూములు అమ్మాలో ఏవి అమ్మొద్దో విచక్షణ ఉండొద్దా?

మాట్లాడితే బీఆర్‌ఎస్‌పై బద్నాం పెడ్తున్నరు. వశమైతలేదని భూములను అమ్మకానికి పెడుతున్నరు. అత్యవసరమైతే కొన్ని అమ్మొచ్చు! ప్రజలకు అవసరం లేని భూములను, విలువ వచ్చేది ఉంటే ప్రజల పనుల కోసం కొన్ని అమ్మొచ్చు! కానీ ఏది అమ్మాలో ఏది అమ్మొద్దో విచక్షణ ఉండాలె కదా? యూనివర్సిటీలను అమ్ముతరా? ఇయ్యాల హెచ్‌సీయూను అమ్ముతున్నరు. విలువైన భూములున్నయని రేపు ఓయూను అమ్ముతరు. ఇలా ఖతం పట్టుకుంట పోతే ఏమైనా మిగులుతదా? ఇది పద్ధతా? ప్రభుత్వం నడిపించే విధానమా? వీళ్లు ఏ విధంగా గోల్‌మాల్ చేస్తున్నరో అందరూ గమనించాలె. నేను యాదగిరి గుట్టకు పోతే ట్రిప్పుకు ఎకరానికి పది లక్షల విలువ పెరుగుతుండె.. మరియ్యాల ఏమైతున్నది? ఏం జరుగుతున్నదో ఆలోచన చెయ్యాలె!

> ముఖ్యమంత్రులుగా పని చేసేవాళ్లకు గాంభీర్యం ఉండాలె.. ధైర్యం ఉండాలె.. రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చిండ్రు. నేను సీఎం అయిన తర్వాత అధికారులను అడిగి ఆ పథకాన్ని అట్లనే ఉంచండి.. మార్చకండని చెప్పిన. ఆరోగ్యశ్రీ మా పథకం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చింది.. దాని పేరు కూడా మార్చలేదని అసెంబ్లీలో కూడా చెప్పిన. కానీ ఇప్పుడు వీళ్లు కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తం.. కేసీఆర్ ముచ్చట లేకుండా చేస్తమంటున్నరు. చేస్తరా?
> -కేసీఆర్

### గౌరవెల్లి, పాలమూరు ఎందుకు పెండింగ్?

సభకు వచ్చేటప్పుడు హుస్నాబాద్‌లో చూసిన. నాడు హరీశ్‌రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలను మెప్పించి ఒప్పించి భూములు తీసుకొని గౌరవెల్లి ప్రాజెక్టు కట్టినం. ఈ ప్రాజెక్టు 90 శాతం పూర్తయింది. కానీ ఏడాదిన్నరగా అందులో తట్టెడు మన్ను తీస్తున్నరా?. పాలమూరు పథకం 80 శాతం పూర్తయింది. ఎందుకు దాన్ని పెండింగ్‌లో పెడుతున్నరు? ఎందుకు పూర్తి చేస్తలేరు?

### ఆర్థిక మంత్రీ.. నీకెందుకయ్యా అంత బాధ?

ఇగ ఈ అందానికి ఏం మాట్లాడుతరు? కేసీఆర్ నువ్వు రా అసెంబ్లీకి అంటున్నరు. ఎందుకు నీ కాయగోకుడు ముచ్చట్లు ఇనడానికా? పిల్లలు (కేటీఆర్, హరీశ్‌రావును ఉద్దేశించి) అడిగితేనే మీరు జవాబు చెప్తలేరు. 20 శాతం కమీషన్ తీసుకుంటున్నరని కేటీఆర్ మాట్లాడితే.. ఆ ఆర్థిక మంత్రి లేచి బుజాలు తడుముకుంటున్నడు. నీకెందుకయ్యా బాధ. నువ్వు తీసుకుంటెనే నీకు బాధ ఉండాలె.. లేచి పెద్ద లొల్లి పెడుతున్నడు. ఇది నేను చెప్పింది కాదు.. ఆర్థిక మంత్రి ఆఫీసు ముందట కాంట్రాక్టర్లే ధర్నా చేసిండ్రు. 20, 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నరని ఆందోళన చేసిండ్రు' అని కేసీఆర్ చెప్పారు.

### ప్రభుత్వాన్ని మేం పడగొట్టం.. ప్రజలే మీ ఈపులు సాప్‌చేస్తరు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతారనే ఆరోపణలను కేసీఆర్ తోసిపుచ్చుతూ 'నేనింకో ముఖ్యమైన మాట చెప్పాలె. ప్రభాకర్‌రెడ్డి అని మా దుబ్బాక ఎమ్మెల్యే ఉన్నడు. ఆయనతో ఎవరో హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. అన్నా ఇంకా మూడేండ్లు భరించాలానే ఈ గవర్నమెంటును అని మాట్లాడిండు. ఆయన ఆ మాటను విలేకరులకు చెప్పిండు. దాన్ని పట్టుకొని అగో చూసిన్రా మా గవర్నమెంటును పడగొడతరట! అని అంటున్నరు. అరె మేమెందుకు పడగొడతం రబై! మాకేమన్న కాళ్లుచేతులు గులగుల పెట్టినయా? మేమా కిరికిరి పనిచెయ్యం. మీరే ఉండాలె. ఓట్లు తీసుకున్నరు. సక్కగ పనిచెయ్యకపోతే మీ ఈపులు ప్రజలే సాప్ చేస్తరు. మేం మీ గవర్నమెంటును పడగొట్టం. ఎందుకంటే మీ సంగతేందో మా సంగతేందో ప్రజలకు పూర్తిగా అర్థం కావాలె' అని కేసీఆర్ చెప్పారు.

# పోలీసులకు రాజకీయాలెందుకు?

**బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్.. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ గవర్నమెంటేనని స్పష్టీకరణ**

- ప్రజల తరపున ప్రశ్నిస్తున్న పార్టీ సోషల్ మీడియా వారియర్లపై కేసులెందుకు పెడుతున్నరు?
- బీఆర్‌ఎస్ సభను ఆపుతరా? ఈ ప్రభంజనాన్ని ఎవరాపుతరు? ఆగవడితే ఆగుతదా?
- సోషల్ వారియర్స్, కార్యకర్తలెవరూ భయపడొద్దు
- ఇక నేనే బయల్దేరుతా అందరి లెక్కలు తేలుస్తా..
- బీఆర్‌ఎస్ సైనికులకు పార్టీ అధినేత కేసీఆర్ అభయం



> ప్రజాస్వామ్యంలో ప్రజలకు అడిగే హక్కు ఉంటది. తప్పకుండా అడుగుతరు. ఇంత అన్యాయం జరుగుతుంటే చూడలేక బీఆర్‌ఎస్‌కు సోషల్ మీడియా వారియర్స్ ప్రజలకు మద్దతుగా నిలబడుతున్నరు. ఇదేం అన్యాయమని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నరు. అలాంటి వాళ్లపై కేసులు పెడుతున్నరు. వాళ్లను పట్టుకుపోతున్నరు. పోలీసు సోదరులను అడుగుతున్నా.. మీరెందుకు దుంకులాడుతున్నరు? మీకు ఏం అక్కెరొచ్చింది? - కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : ఓరుగల్లు వేదికగా నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్ పోలీసులపై గర్జించారు. 'రాజకీయాలు మీకెందుకు? మీకెందుకు దునుకులాట? ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్లపై ఎందుకు కేసులు పెడుతున్నరు?' అంటూ నిలదీశారు. ఎల్కతుర్తిలో సభలో కేసీఆర్ మాట్లాడుతూ "పోలీసు సోదరులను అడుగుతున్నా.. మీరెందుకు దుంకులాడుతున్నరు? మీకు ఏం అక్కెరొచ్చింది? మీకు ఒక్కటే చెప్తున్నా. మీకు తెల్వదా? మీరు చదువు కోలేదా? మీకు కూడా విజ్ఞానం ఉన్నది కదా? మీకు దొంగ వాగ్దానాలు చేయలేదా? ప్రజల్ని మోసం చేయలేదా? ప్రజాస్వామ్యంలో ప్రజలకు అడిగే హక్కులేదా? మీరెందుకు కేసులు పెడుతున్నరు? మీరెందుకు దుంకులాడుతున్నరు.. రేపు మీరెందుకు బలైతరు? మీకు రాజకీయాలెందుకు? మీ డ్యూటీ మీరు చేయండి! బీఆర్‌ఎస్ ఎప్పుడూ చట్టాలను ఉల్లంఘించదు. తెలిపారు.

> బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్లకు, కార్యకర్తలకు ఒక్కటే చెప్తున్నా.. ఎక్కడైనా ఎవరైనా మీపై అన్యాయంగా కేసులు పెడితే మన బీఆర్‌ఎస్ లీగల్ సెల్ వీరులున్నరు. మీరు భయపడాల్సిన అవసరం లేదు. మీకు అండగా కేసీఆర్ ఉంటడు.. బీఆర్‌ఎస్ ఉంటది.. ఇక ఈడికెళ్లి ఊరు కోను.. నేను కూడా బయల్దేరుతా. ఎక్కడి దాకైనా మంచిదే.. ఎవరి సంగతేందో.. ఎవరి లెక్కేందో అన్ని లెక్కలు తీద్దాం..
> -కేసీఆర్

### పోగొట్టుకున్నకాన్నే వెతుక్కోవాలె

అవివేకంతో, అజ్ఞానంతో ఘోరం చేసి అడ్డమైన మాటలన్నీ చెప్పిండ్రు. ఆ మాటలతో మనం కూడా గోల్‌మాలైనం. తీర్థం పోదాం తిమ్మక్కా అంటే వాడు గుల్లె.. మనం సల్లె అనే గతికి తెచ్చిండ్రు. ప్రజలు కూడా ఆలోచన చెయ్యాలె. ఆవేశం పనికిరాదు. హైదరాబాద్‌లో ఓ తమ్ముడి ఇల్లు కూలగొడితే.. ఆ తమ్ముడన్నడు.. కేసీఆర్ అన్నా యాడున్నవ్ నువ్వు రావాలె అన్నడు. అంటె కత్తి వాడి చేతిలో పెట్టి యుద్ధం నన్ను చేయమంటున్నరు. గాడిదలకు గడ్డేసి బర్లకు పాలు పిండితే వస్తయా? జాగ్రత్తగా ఆలోచించాలె' అని ప్రజలను కేసీఆర్ కోరారు. 'మీ వెంట బీఆర్‌ఎస్ ఉంటది.. మీ వెంట కేసీఆర్ ఉంటడు. వందశాతం మళ్లీ విజయం సాధించాలే. గులాబీ జెండా ఎగరేయాలె. అద్భుతమైన తెలంగాణను మళ్లీ సాధించాలె.

### వీళ్లు చేస్తరు.. మనం బతుకుతమా?

మేం కూడా టైమివ్వాలని ఇచ్చినం. లేదంటే ఏమంటరు.. ప్రజలు మీకేసినట్టే మాకూ ఓట్లేసిండ్రు.. ఏడాదైనా టైం ఇయ్యరా? ఏడాదినర్ధమైనా టైం ఇయ్యరా? మీకు కన్నెర్ర అంటరని నేను నోరు తెరువలేదు. కృష్ణా జలాలపై గడబిడ జరిగితే నల్లగొండకు వెళ్లి గర్జన చేసొచ్చిన గానీ నేనెక్కడా బయటకు రాలేదు. కానీ ఏడాదినర్ధం అయిపోయింది. ఇంకేం పాడైంది? పువ్వు పుట్టంగనే పరిమళిస్తదన్నట్టుగా ప్రభుత్వం కథ తెల్వదా? వీళ్లకు టైం ఎక్కడున్నది? చివరి ఆర్నెళ్లు ఎలక్షన్లే! వీళ్లకు ఉన్న సమయమే రెండున్నరేండ్లు! ఈ రెండున్నరేండ్లలో వీళ్లు పనులు చేస్తరు.. మనం బతికి ముందరపడతమా? అందుకే తెలంగాణ ప్రజలు, మేధావులు ప్రతి ఒక్కరూ దయచేసి ఆలోచించాలె. దీనికి పరిష్కారం ఏమిటో కనుక్కోవాలె. ఆలోచనతో పని చెయ్యాలె. ఆవేశంతో కాదు. ఆవేశంతో నినాదాలు ఇస్తే సరిపోదు. ముల్లును ముల్లుతోనే తియ్యాలె. ఏడ పోగొట్టుకున్నమో గాన్నే వెతుక్కోవాలె. జారిపోయిన చోటనే దొరకపట్టాలె. ఆ నైపుణ్యం, స్థాయి రావాలె అని చెప్పారు.

> పోలీస్ మిత్రులారా ఈ రోజు రాత్రి మీ ఇండ్లకు వెళ్లి డైరీల్లో రాసుకోండి.. మీ డైరీల్లో రాసి పెట్టుకోండ్రి (మరోసారి అంటూ).. ఇయ్యాల తెలంగాణ చెలరేగిన పరిస్థితిని చూస్తే వందకు వంద శాతం మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ గవర్నమెంటే! దాన్ని ఎవడూ ఆపలేడు. అది ఎవని తరం కాదు.. ఎవని వశం కాదు
> -కేసీఆర్

### బీఆర్‌ఎస్ ప్రభంజనాన్ని ఎవడాపుతడు?

**ఈ రోజు మనం** ఇక్కడ సభ పెట్టుకుంటే ఎన్ని అడ్డంకులు సృష్టిస్తున్నరు. ప్రైవేటు స్కూలు వాళ్లు బస్సులిస్తే వాళ్లకు నోటీసులిస్తున్నరు. అడుగడుగునా ఆర్టీఏ అధికారులను, పోలీసులను పెట్టి ట్రాఫిక్ జామ్ చేస్తున్నరు. ఇప్పుడు కూడా సభకు రావాల్సిన వాళ్లు లక్ష.. లక్షాయాభై వేల మంది బయటనే ఆగిపోయిండ్రు. హనుమకొండ, హుజూరాబాద్, సిద్దిపేట దిక్కు ఇట్ల మూడు రోడ్లలో జామైంది. నేను మా నాయకులను అడిగితే.. ఇబ్బందులు పెడుతున్నరు.. రానిస్తలేరు సార్.. లారీలు తెచ్చి అడ్డం పెడుతున్నరని చెప్పిండ్రు. మరి ఓ అర్ధ గంట ఆగి మాట్లాడుదామని నేనంటే లేదు సార్ వచ్చినవాళ్లు దూరం పోవాలె.. రానోళ్లు ఎలాగూ సభకు అందరు.. మాట్లాడి సభ ముగిద్దామని చెప్తే నేను వచ్చిన. ఇన్ని అడ్డంకులా? ఇంత కడుపుబ్బనా? ఆపుతరా? బీఆర్‌ఎస్ సభలను ఆపుతరా? ఈ ప్రభంజనాన్ని ఎవడు ఆపుతడు? ఆగవడితే ఆగుతదా..?



# సిపాయిలం అన్నోళ్లకు శాతనైతలేదా?

- నాడు జబ్బలు, మెడలు చరిచిండ్రు
- అజ్ఞానంతో సర్వనాశనం చేసిండ్రు
- కేసీఆర్ పక్కకు పోంగనే ఆగమైతదా
- ప్రజల్నెందుకు గోసపుచ్చుకుంటున్నరు
- మాపాలనలో భూముల ధరలెట్లుండే
- కాంగ్రెస్‌పై కేసీఆర్ ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): హామీలు ఇచ్చుడే తప్ప కాంగ్రెస్‌కు వాటి అమలు చేతకాదని కేసీఆర్ విమర్శించారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చారని, తమను మించిన సిపాయిలు లేరని జబ్బలు చరిచారని పేర్కొన్నారు. ఆదివారం ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాట్లాడుతూ ''కాంగ్రెస్ వచ్చి యాడాదినర్థమాయే. ఏం మాయరోగమమొచ్చే. ఏం బీమారి వచ్చే. ఏమేమి చెప్పిరి. వరుస బెట్టి గోల్‌మాల్ దింపుట్ల, అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్‌ను మించినోడు లేడు. రైతుబంధు కింద 15 వేలు ఇస్తామని చెప్పిండ్రు. పబ్లిక్‌ను బోల్తా కొట్టించేందుకు క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తామని చెప్పిండ్రు. 420 హామీలు ఇచ్చారు. వాళ్ల నోటికి మొక్కాలే. కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పిండ్రు. ఎక్కడన్నా వస్తున్నదా?

### మమ్మల్ని మించిన సిపాయిలు లేరన్నరు

మాది 120 ఏండ్ల పెద్దపార్టీ.. మమ్మల్ని మించిన సిపాయిలు లేరన్నారు. ఉచిత బస్సు అని పెడితే జుట్లు పట్టుకుని కొట్టుకునేందుకు పనికి వస్తుంది తప్ప ఉపయోగం లేదు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, కంటి వెలుగు పథకాలను పెట్టమని ఎవరూ అడగలే. మన రాష్ట్రం, మన ప్రజలని, వారిని బాగు చేయాలని మా అంతట మేమే పెట్టినం. మేం పారిశ్రామిక రంగం మీద దృష్టిపెట్టినం. పెట్టుబడులు ఆకర్షించినం. సుమారు 20 నుంచి 25 లక్షల మందికి ఉద్యోగాలిప్పిచ్చినం. బీఆర్‌ఎస్ పాలనలో మతకల్లోలాలు లేవు. కర్ఫ్యూలేవు. శాంతిభద్రలను కాపాడినం. మా అంత సిపాయిలు లేరు. ఆ చందమామలు పెడతం. ఏడు సూర్యుళ్లను పెడతమని నమ్మబలికి మంచిగున్న తెలంగాణను ఆగంబట్టించి ఓట్లేయించుకుని ప్రజలను దగా చేసిండ్రు.

### కేసీఆర్ పక్కకు పోంగనే ఆగమైతదా

తెలివితక్కువ పనితో, అవివేకంతో, అజ్ఞానంతో పరిపాలన చెయ్యరాక సర్వనాశనం చేసిండ్రు. నా కండ్ల ముందే తెలంగాణ సర్వనాశనమవుతుండటం నాకు దుఃఖం కలిగిస్తున్నది. కేసీఆర్ పక్కకు పోంగనే ఇంత ఆగమైతదా? నేను అసెంబ్లీల నిలబడి ఛాలెంజ్ చేసిన ఐదేండ్ల లోపల మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా పెట్టి, నీళ్లు ఇవ్వకపోతే మళ్లా వచ్చే ఎన్నికల్లో నిలబడం, ఓట్లు అడగమని చెప్పిన. ఇలా ఎవరు చెప్తారు. దమ్మున్నోడే ఇట్లా చెప్తాడు. చేసి చూపిచ్చినం. అమలవుతున్న పథకం. గా మంచినీళ్లు కూడా ఇవ్వడం శాతనైతలేదా? మేమింత సిపాయిలం.. అంత సిపాయిలం అన్నోళ్లోకు మంచినీళ్లు కూడా ఇవ్వడం శాతనైతలేదా? మళ్లా 2014కు ముందటి పరిస్థితులొస్తున్నాయి. రైతాంగం దోపిడీకి గురవుతున్నది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కాదా? ఇది కాంగ్రెస్ శాపం కాదా?'' అని కేసీఆర్ ప్రశ్నించారు.